www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 4 జులై 2023

చంద్రప్రభ వాహనంపై సౌమ్యనాథుడు

ప్రజాశక్తి-నందలూరు

తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆరో రోజైన సోమవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథ స్వామి మాఢవీధుల్లో విహరించారు. సాయంత్రం గ్రామోత్సవంలో భాగంగా చంద్రప్రభ వాహనంపై భక్తుల గోవింద నామస్మరణ మధ్య ఊరేగించారు. కార్యక్రమంలో టిటిడి డిప్యూటీ ఇఒ, ఆలయ ఇన్‌స్పెక్టర్ నటేష్ బాబు, దిలీప్ కుమార్, ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి చంద్రనాథ్, సోమిశెట్టి ప్రధాకర్, గుణయాదవ్, మణి, నాగసుబ్బయ్య, చంద్ర, అర్చకులు సునీల్ కుమార్ శర్మ, సాయికృష్ణశర్మ, బాలస్వామి, రుత్వికులు శ్రీనివాస్, ఎంజి కృష్ణతరుణ్, పార్థసారథి, భార్గవ్, సీతారాం, ప్రశాంత్, మనోజ్ కుమార్, పవన్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలలో నేడు : బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ సౌమ్యనాథ స్వామి కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇఒ నటేషన్ తెలిపారు.

ప్రత్యేక నవజాత శిశు విభాగం ఏర్పాటుకు

కసరత్తు

రూ.60 లక్షలతో ప్రతిపాదనలు
20 అదనపు బెడ్స్ ఏర్పాటు
ఆగస్టు నెలాఖరు నాటికి పూర్తి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ప్రత్యేక నవజాత శిశు విభాగం ఏర్పాటుకు కసరత్తు ఊపందుకుంది. జిజిహెచ్ అధికార యంత్రాంగం ఆగస్టు నెలాఖరు నాటికి ఏర్పాటు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటోంది. జిల్లా సర్వజనాస్పత్రి వెనుకభాగంలోని అదనపు భవనాలను ఎంపిక చేసింది. వైద్య అవసరాలు, పరికరాలకు అవసరమైన వసతుల కల్పనకు సంబంధించి రూ.60 లక్షలతో కూడిన ప్రతిపాదనలు అందజేసింది. జిజిహెచ్‌లో గర్భిణులకు, నవజాత శిశుసంరక్షణ మెరుగైన చికిత్స అందిస్తున్న నేపథ్యంలో నిరుపేదలు, పేదలు, దిగువ మధ్య తరగతి, మధ్యతరగతి ప్రజానీకం జిజిహెచ్‌ను ఆశ్రయిస్తున్న సంగతి తెలిసిందే. జిజిహెచ్‌లో కాన్పుల విభాగం మొదలుకుని నవజాత శిశువిభాగానికి రోజురోజుకూ ఒత్తిడి పెరిగిపోతోంది. కాన్పుల విభాగంలో బెడ్‌కు ఇద్దరు, ముగ్గురు చొప్పున వైద్య చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. దీనికి అదనపు విభాగమైన నవజాత శిశువిభాగంలో 20 బెడ్స్ నిండిపోతోంది. మరో 20 అదనపు బెడ్‌లకు అనుమతి లభించింది. మొత్తం 40 బెడ్స్ అందుబాటులోకి రానున్నాయి. ప్రత్యేక నవజాత శిశువిభాగంలో కీలకమైన వైద్యపరికరాల ఏర్పాటుపై దృష్టి సారించింది. ఇందులో ప్రధానంగా ఫొటోథెరఫీ, వార్మర్, ఇంక్యుబేటర్, సి-క్యాప్ యూనిట్స్, సెంట్రల్ ఆక్సిజన్ పరికరాలు, ఆంటల్ సెక్షన్ వంటి పరి కరాలను ఏర్పాటు చేయనున్నారు. వీటికి రూ.34 లక్షలు వెచ్చించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా జిజిహెచ్‌లో ప్రత్యేక ఎసెన్సియా ఏర్పాటుకు అనుమతి లభించిన నేపత్యంలో నెలలు నిండక ముందే పుట్టిన నవజాత శిశువులకు మెరుగైన వైద్యసేవలు అం దుబాటులోకి వచ్చే అవకాశం ఉందని చెప్పవచ్చు.

సర్వే వంద శాతం పూర్తి కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

ఎన్‌సిడి-సిడి సర్వే వంద శాతం పూర్తి కావాలని కలెక్టర్ గిరీష మెడికల్ ఆఫీసర్లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మెడికల్ ఆఫీసర్లతో ఎన్‌సిడి-సిడి సర్వే, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, అనిమిక్ టెస్టింగ్, డెంగీ, మలేరియా, తదితర అంశాలపై కలెక్టర్ గిరీష పిఎస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ప్రతి ఇంటింటికి వెళ్లి ఆ కుటుంబంలోని సభ్యుల ఆరోగ్య స్థితిగతులు సంపూర్ణంగా తెలుసుకుని ప్రతి ఒక్కొరికీ ఒక హెల్త్ ఐడిని క్రియేట్ చేయాలని ఇందుకు సంబంధించి జరుగుతున్న ఎన్ సిడి-సీడీ సర్వేను పగడ్బందీగా వంద శాతం పూర్తి చేయాలన్నారు. ఈ విషయంలో మెడికల్ ఆఫీసర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. రోజూ ఎఎన్ఎం ద్వారా వారు అందించిన వైద్య సేవలను సంబంధిత యాప్‌లో వందశాతం అప్‌లోడ్ చేసి జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచేందుకు మెడికల్ ఆఫీసర్లు కృషి చేయాలన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి ఎప్పటికప్పుడూ రక్తపరీక్షలు నిర్వహించి అనీమియా నివారణకు కృషి చేయాలన్నారు. ఇంటి వద్దకే వైద్య సేవలు - ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా డయాబెటిస్, హైపర్ టెన్షన్ రోగులకు తరచూ వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అతిసార వ్యాధి నివారణకు చర్యలు చేపట్టాలని, చిన్నపిల్లలకు విరోచనాలు అవుతున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆశా, ఎఎన్ఎం, ఆరోగ్య కార్యకర్తలు తల్లులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి పిహెచ్‌సిలోనూ ఇన్‌స్టిట్యూషనల్ డెలవరీలు తప్పక నిర్వహించాలన్నారు. పిహెచ్‌సిలలో మెడికల్ ఆఫీసర్, ఎఎన్ఎం, నర్సులు, సిబ్బంది ఉన్నారని, ఇకనుంచి తప్పక నార్మల్ డెలివరీలు జరిగేటట్లు చూడాలన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో టిబి కేసులకు సంబంధించి ఎఎన్ఎం వారీగా రిపోర్టు పంపాలన్నారు. ల్యాబ్ టెక్నీషియన్లు అందుబాటులో ఉండి ప్రజలకు అవసరమైన పరీక్షలు ఎప్పటికప్పుడూ నిర్వహించాలన్నారు. ప్రతి సచివాలయంలో ఉన్న మందుల వివరాలు ప్రజలకు తెలిసే విధంగా నోటీసు బోర్డులో డిస్‌ప్లే చేయించాలన్నారు. ఆరోగ్యశ్రీ రెఫరల్ కేసులకు సంబంధించి రిజిస్టర్లో నమోదు చేసి డేటా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. కలెక్టర్ వివిధ అంశాలలో సమీక్షించి పలు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య, మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రభుత్వ సేవలు అందాలన్నదే జగనన్న సురక్ష లక్ష్యం

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమం, ప్రభుత్వ సేవలు అందించాలన్నదే జగనన్న సురక్ష కార్యక్రమ లక్ష్యమని పటిష్టవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ గిరీష తెలిపారు. సోమవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జగనన్న సురక్ష, విద్యార్థుల గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ అంశాలపై జిల్లా అధికారులు ఆర్డీవోలు, మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, టాస్క్ ఫోర్స్ అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఇతర మండల అధికారులు, పంచాయతీ సెక్రెటరీలతో కలెక్టరు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హత ఉన్న ఏ ఒక్కరి నోటి నుంచి ప్రభుత్వ పథకాల ఫలాలు అందలేదని మాట రాకూడదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు సేవలు అందించేలా అధికారులు బాధ్యతాయుతంగా కృషి చేయాలన్నారు. ఇందులో భాగంగా ప్రతి సచివాలయ పరిధిలో ఇంటింటి సర్వే వందశాతం పూర్తి కావాలన్నారు. ఎవరికి ఏ అవసరమో గుర్తించి వారికి సర్వీస్ రిక్వెస్ట్ నమోదు చేయాలని ఒకసారి సర్వీస్ రిక్వెస్ట్ నమోదు చేస్తే తప్పనిసరిగా ఆ సర్వీసుని అందించాలని సూచించారు. జిల్లాలో ఇంకా ఎక్కడైనా వాలంటీర్లు ఇంటింటి సర్వే చేయకుండా ఉంటే సంబంధిత తహశీల్దార్లు, ఎంపిడిఒలు వెంటనే సర్వే చేయించి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఒకవేళ వాలంటీర్ పోస్ట్ ఖాళీ ఉంటే మరొకరికి ఇన్‌చార్జి ఇచ్చి వెంటనే సర్వే చేయించాలని ఆదేశించారు. స్వీకరించిన దరఖాస్తులను జగనన్న సురక్ష శిబిరాలలో పరిష్కరించాలని చెప్పారు. వివిధ కారణాలవల్ల పథకాలు అందకుండా మిగిలిపోయిన వారికి కూడా పథకాలు అందించాలని సదుద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. అనంతరం సర్వే ప్రగతిపై మండలాల వారీగా సమీక్షించారు. జిల్లాలో జూలై 15 లోగా యుద్ధప్రాతిపదికన వందశాతం విద్యార్థుల గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ జరగాలని జీరో డ్రాప్ఔట్స్ ఉండాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అంగన్వాడి ప్లే స్కూల్ నుంచి ఒకటవ తరగతిలోకి, అలాగే ఆరు, ఎనిమిది, తొమ్మిదవ తరగతిలలో పూర్తిగా జాయిన్ అయ్యేలా చర్యలు తీసుకొని జీరో డ్రాప్ అవుట్స్ ఉండేలా చూడాలన్నారు. జీవన పదవ తరగతి ఫెయిల్ అయిన వారందరినీ మరలా పదిలో ఎన్‌రోల్ చేయాలని, ఆ విధంగా చేయడం వల్ల వారికి అమ్మబడి జగనన్న విద్యా కానుక మధ్యాహ్నం భోజన పథకం తదితరాలు వర్తిస్తాయని చెప్పారు. అనంతరం వివిధ అంశాలలో సమీక్షించి పలు సూచనలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, డిఆర్ఒ సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కార్మికులకు ఇపిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలి

నిరసన తెలుపుతున్న గ్రామ పంచాయతీ కార్మికులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గ్రామ పంచాయతీ కార్మికులకు ఇపిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు డి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక డిఎల్‌పిఒ కార్యాలయంలో ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు 2012 నుంచి ఇపిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని ఆదేశాలు ఉన్నా అమలు చేయలేదన్నారు. 2019లో జిఒ నెంబర్ 57, 132లలో ఇపిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని, బ్యాంక్ ద్వారా తీరాలు ఇవ్వాలని ఆదేశాలు ఉన్నా ఇప్పటి వరకు మదనపల్లె రూరల్ గ్రామ పంచాయతీలలో కార్మికులకు ఎవరికి అమలు చేయలేదన్నారు. గతంలో డిఎల్‌పిఒకి చాలా పర్యాయములు నోటీసు ఇచ్చామని ఇంత వరకు అమలు చేయలేదన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులకు 2015లో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు కూడా పక్కన పెట్టి కార్మికుల దగ్గర శ్రమ దోపిడీ చేయించుకుంటూ, కనీస వేతనాలు కూడా ఇవ్వకుండా చాలా అన్యాయం చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా మదనపల్లె డివిజన్ పంచాయతీ అధికారి స్పందించి అన్ని గ్రామ పంచాయతీలలోని కార్మికులకు ఇపిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని, లేనిపక్షంలో ఈ నెల10వ తేదీ నిర్వధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. డిఎల్‌పిఒ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సురేంద్ర, ప్రధాన కార్యదర్శి నాగరాజు, సిఐటియు మండల అధ్యక్షులు వెంకటేష్, గోపాలు, నరసింహులు, రంగస్వామి, రవి, ప్రమీల పాల్గొన్నారు.

వెలిగల్లు రిజర్వాయర్‌లో చేపల వేట నిషేధం

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లాలోని సోమశిల వెనక జలాలు, వెలిగల్లు రిజర్వాయర్‌లో చేపల వేట నిషేధం విధించామని, ఎవరు చేపలు పట్టినా కఠిన చర్యలు తప్పవని జిల్లా మత్స్యశాఖ అధికారి సుష్మిత అన్నారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ సోమశిల వెనక జలాలు, వెలిగల్లు రిజర్వాయర్, పరివాహక ప్రాంతాల్లో జులై 1 నుంచి ఆగస్టు 31 వరకు చేపల వేట నిషేధించామన్నారు. చట్టవ్యతిరేకంగా చేపలు పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పెద్దిరెడ్డి కుటుంబంపై విమర్శలు తగవు

ప్రజాశక్తి-పీలేరు

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంపై టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి విమర్శలు చేయడం తగదని ఎపిఎండిసి డైరెక్టర్ సి.హరీష్‌రెడ్డి అన్నారు. సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కిషోర్ తన వ్యక్తిగత ప్రచారం కోసమో లేక ఉనికిని కాపాడుకోవడం కోసమో పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నాడని విమర్శించారు. కిషోర్ చెప్పినట్లుగా చిన్న వయసులోనే ఓటరుగా నమోదు చేయడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఓటరు నమోదుకు ఆధార్ కార్డు తప్పనిసరి అన్న కనీస జ్ఞానం కూడా లేకుండా ఆయన ఆరోపణలు చేయడం అతని అవగాహన రాహిత్యానికి ఓ నిదర్శనమని పేర్కొన్నారు. వైసిపి నాయకులు కానీ, కార్యకర్తలు కానీ ఎవరూ ఓటర్ల నమోదుకు ప్రయత్నించలేదని చెప్పారు. కలికిరి మండలంలోని నగిరిపల్లి పంచాయతీలోనే 210 డబుల్ ఎంట్రీ ఓటర్లు ఉన్నారని ఆరోపించారు. సమావేశంలో జడ్‌పిటిసి ఏటి రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష, వైస్ ఎంపిపిలు హరిత వెంకటరమణ, వెంకటాచలపతి, ఎఎంసి చైర్మన్ ఎల్లయ్య, మండల పార్టీ కన్వీనర్ దండు జగన్మోహన్‌రెడ్డి, మాజీ కన్వీనర్ నారే వెంకటరమణారెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి హుమయూన్, అన్నమయ్య జిల్లా మహిళా అధ్యక్షులు మహిత ఆనంద్, సాంస్కృతిక పర్యాటక శాఖ జిల్లా బోర్డు సభ్యులు షేక్ షాకీర్ బాషా, ఇతర ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న హారీష్‌రెడ్డి

బస్సు షెల్టర్‌లో పెట్టిన ద్విచక్ర వాహనాలు

ద్విచక్ర వాహనాల అడ్డాగా బస్సు షెల్టర్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాయచోటి పట్టణం కర్నూల్-చిత్తూరు జాతీయ రహదారి డిగ్రీ కళాశాల వద్ద ఉన్న బస్సు షెల్టర్ ఎవరి కోసం అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. బస్సు షెల్టర్ వద్ద ద్విచక్ర వాహనదారులు పెట్టడంతో ప్రయాణికులు కూర్చునేందుకు వీలులేని పరిస్థితి నెలకొంది. పలువురికి నీడను ఇవ్వాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన షెల్టర్‌లో ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేయడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడి నుంచి నిత్యం వందల మంది ప్రయాణికులు,డిగ్రీ కళాశాల విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. అలాంటి బస్సుషెల్టర్‌ను పార్కింగ్‌గా వాడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని బస్సు షెల్టర్‌లో ఎలాంటి వాహనాలు పార్కింగ్‌కు ఆస్కారం లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

'కార్పొరేట్' కబంధ హస్తాల్లో విద్యా శాఖ : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

జిల్లాలో జిఒనెంబర్ 1, 42 అమలు చేయించడంలో విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారని, ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థల కబంధ హస్తాల్లో చిక్కుకుపోయారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ సర్వేపల్లి అన్నారు. సోమవారం స్పందనలో కలెక్టర్ పి.ఎస్.గిరీష్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారులు తెలియ జేస్తున్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. రాజంపేట, రైల్వే కోడూరు ప్రాంతాల్లో ప్రయివేట్ స్కూల్ బస్సుల్లో అధికంగా విద్యార్థులను ఎక్కిస్తున్నారని స్థానికంగా ఉన్న ఆర్‌టిఒకు సమాచారం ఇచ్చిన ఎలాంటి స్పందన లేకపోవడం దారుణం అన్నారు. రాజంపేట, రైల్వేకోడూరు పీలేరు, మదనపల్లె, రాయచోటి ప్రాంతాలలో పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేకుండా పాఠ్య పుస్తకాలు పేరుతో విద్యార్థులు వారి తల్లిదండ్రుల దగ్గర నుంచి వేలాది రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్నారని, విద్యార్థి సంఘాలుగా అనేక పిర్యాదులు చేసినా ఎలాంటి విచారణ చర్యలు చేపట్టలేదు అన్నారు. కొన్ని పాఠశాలలో ఎటువంటి అనుమతులు లేకుండా హాస్టల్లో కూడా చేరవేస్తున్నారన్నారు. జిల్లాలో ఉన్న అనేక హాస్టల్‌లో జిల్లా విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేయాల్సింది పోయి, కార్పొరేట్, ప్రయివేట్ విద్యా సంస్థలకు అండగా ఉండడం విద్యా శాఖ దారుణం అన్నారు. ప్రభుత్వం, ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక పేరుతో ప్రభు త్వం టెండర్ ద్వారా ఒక్కో విద్యార్థికి కేవలం రూ.2,400 ఖర్చు చేస్తుందని, అదే కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాల వారు ఇచ్చే 7,8 పుస్తకాలకే రూ.6,000 నుండి రూ.10 వేలు తీసుకుంటున్నారు. వారి ఆదాయం మొత్తంలో సగభాగం పుస్తకాల్లోనే సంపాదిస్తున్నారని వాపోయారు. ఆర్‌జెడి వెంకటకృష్ణారెడ్డి, అన్నమయ్య జిల్లా డిఇఒ పురుషోత్తం, డిప్యూటీ డిఇఒ కృష్ణప్ప, వరలక్ష్మి, కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలకు అనుమతులు రెన్యువల్ విషయంలో మామూళ్లు తీసుకొని ఇస్తున్నారనే ఆరోపణలున్నాయని పేర్కొ న్నారు. ఇప్పటికైనా స్పందించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణం కార్యదర్శి నరేష్, భాను, భానుప్రకాష్ పాల్గొన్నారు.

కలెక్టర్ గిరీషకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహా

విద్యార్థి సోహిత్ మృతి గురించి వివరాలు తెలుసుకుంటున్న ఎస్‌పి అన్బురాజన్

విద్యార్థి సోహిత్ మృతిపై ఎస్‌పి విచారణ

ప్రజాశక్తి -ఖాజీపేట

కడప జిల్లా ఖాజీపేట మండల పరిధిలోని కొత్త నెల్లూరు సమీపంలోని బీరం శ్రీధర్‌రెడ్డి పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి సోహిత్(11) అనుమానాస్పద మృతిపై విచారణ కొనసాగుతూనే ఉంది. సోమవారం ఎస్‌పి అన్బురాజన్ పాఠశాలను సందర్శించారు. సోహిత్ మృతి ఘటనకు సంబంధించి పాఠశాల సిబ్బంది, విద్యార్థులను విచారించారు. సోహిత్ ఉన్న తరగతి గది, వసతి గృహాన్ని పరిశీలించారు. వసతి గృహంలో సిసి ఫుటేజీ, పోస్ట్ మార్టం నివేదికల ఆధారంగా పూర్తి వివరాలను రెండు రోజుల్లో మీడియా సమావేశంలో వెల్లడించనున్నట్లు ఎస్‌పి తెలిపారు. సోహిత్ వేలి ముద్రలు, డాగ్ స్క్వాడ్ ద్వారా మరింత లోతుగా విచారణ చేపట్టనున్నట్లు చెప్పారు. సిసి ఫుటేజ్‌లో విద్యార్థి పైఅంతస్తు నుంచి కింద పడినట్లు ప్రాథమిక అంచనా ద్వారా వెల్లడైందని మైదుకూరు డిఎస్‌పి వంశీధర్‌గౌడ్ ఎస్‌పి అన్బురాజన్‌కు వివరించారు. విద్యార్థి వసతి గృహాన్ని, తోటి విద్యార్థులను కూడా విచారించినట్లు పోలీసు ఉన్నత అధికారులు చెప్పారు. సోహిత్ మృతి ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను విచారణ అనంతరం వెల్లడించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మైదుకూరు రూరల్ సిఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ కుల్లాయప్ప, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వాస్థ్య ఆస్పత్రి ప్రారంభం

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

పట్టణంలోని నక్కలదిన్నెలో నూతనంగా నిర్మించిన స్వాస్థ్య మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని ఎమ్మెల్యే నవాజ్‌బాషా ప్రారంభించారు. తొలుత జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి మహేశ్వరనాథ్ బాబాజీకి నివాళులర్పించారు. అనంతరం ఆస్పత్రిలోని అన్ని విభాగాలను సందర్శించారు. ఈ సందర్భంగా ముంతాజ్‌అలీ మాట్లాడుతూ పేదప్రజలకు అందుబాటులో స్వాస్థ్య మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించామన్నారు. తమ ఆస్పత్రిలో మెడిసిన్, సర్జరీ, ఎమర్జెన్సీ, క్రిటికల్ కేర్, ఆర్థోపెడిక్, సైకియాట్రీ, వైద్యసేవలు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. పట్టణంలోనే తొలిసారిగా ట్రామాకేర్ సెంటర్, సీటీ స్కానింగ్, 24 గంటల ఫార్మసీ, ల్యాబ్ పరీక్షలతో పాటుగా ఆధునిక వసతులతో ఆపరేషన్ థియేటర్స్ ఏర్పాటుచేస్తున్నామన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్యసేవల్లో ఎక్కడా రాజీపడకుండా, కార్పొరేట్ ఆస్పత్రులను తలదన్నే స్థాయిలో అనుభవజ్ఞులైన వైద్యులతో సేవాదృక్పథంతో నామమాత్రపు ఫీజులతో తమ ఆస్పత్రిలో వైద్యసేవలు తలదన్నే స్థాయిలో అనుభవజ్ఞులైన వైద్యులతో సేవాద ృక్పథంతో నామమాత్రపు ఫీజులతో తమ ఆస్పత్రిలో వైద్యసేవలు అందిస్తామన్నారు. మంగళవారం నుంచి ఒపి సేవలు అందుబాటులో ఉంటాయని, పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ప్రియం, సత్సంగ్ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రి ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే, యాజమాన్యం

కోదండరాముడికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా సీతారాముల కల్యాణం

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

గురుపౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం శ్రీకోదండ రామాలయం ఆలయ ప్రధాన అర్చకులు వీణ రాఘవాచార్యులు ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని మనోజ్, శ్రవణ్ శాస్త్రోక్తంగా నిర్వహించారు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనుంజయులు, సిబ్బంది గువ్వల ప్రవీణ్, గురుమోహన్ పాల్గొన్నారు. కాగా తెలంగాణ రాష్ట్రంలోని సికింద్రాబాద్‌కు చెందిన సిఎస్ఎన్ మూర్తి దంపతులు గురుపౌర్ణమి సందర్భంగా సీతారాముల కల్యాణం సందర్భంగా సీతమ్మ అలంకారానికి రూ.2.70 లక్షల విలువైన స్వర్ణ హారం బహుకరించారు.

స్పందన ఫిర్యాదులను పరిష్కరించండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజ తెలిపారు. సోమవారం పురపాలిక కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ప్రజలు తీసుకొచ్చిన అర్జీలను తీసుకున్నారు. మొత్తం ఐదు సమస్యలు వచ్చాయన్నారు. 13వ వార్డులో టివిఎస్ షోరూమ్ దగ్గర 3 రోజులుగా వీధి దీపాములు వెలగడం లేదని, మోతీనగర్ కాలువ రిపేరు చేయాలని, ఆర్ఆర్ క్యాటరింగ్ ఇండ్ల మధ్యలో ఉండంవలన ప్రజలకు రాక పోకలకు చాలా ఇబ్బందిగా ఉందని, దీనిని వేరొక్క చోటుకు మార్చాలని తదితర సమస్యలు వచ్చినట్లు తెలిపారు. ఫిర్యాదులకు సంబంధిత అధికారులకు వెంటనే పరిష్కార నిమిత్తం అదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పురపాలక సంఘం అన్ని శాఖాధిపతులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు

- ఆర్‌టిసి బోర్డు డైరెక్టర్ ఎ.రాజారెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ప్రజా రవాణా ఉద్యోగుల పెండింగ్ సమస్యలైన క్రమ శిక్షణా చర్యలపై పనిష్మెంట్స్ అప్పీల్స్ పరిష్కరించే అధికార సర్క్యులర్ త్వరలో విడుదల కానుందని ఆర్‌టిసి బోర్డు డైరెక్టర్ ఎ.రాజారెడ్డి తెలిపారు. సోమవారం పీలేరు డిపో కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా రవాణా విభాగం ఉద్యోగులను అయోమయానికి గురిచేస్తున్న కేడర్ స్ట్రెంత్ భూతానికి ఉద్యోగులు భయపడాల్సిన పనిలేదని పేర్కొన్నారు. ఉద్యోగులు ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న డిపోల్లోనే ఇక ముందు కూడా విధులు నిర్వహించు కోవచ్చన్నారు. ఉద్యోగుల అంగీకారంతోనే లీడర్ స్ట్రెంత్ బదిలీలు ఉంటాయని చెప్పారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో 2016 నుండి 2019 వరకు భర్తీ జరగని 1168 మందికి కారుణ్య నియామకాలను 3 దశల్లో గ్రామ, వార్డు సచివాలయం, ప్రజా రవాణా శాఖలో, కలెక్టర్ల ద్వారా కారుణ్య నియామకాలు పూర్తి చేసిన ఘనత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని అన్ని డిపోల నుండి తిరుమలకు నేరుగా బస్సు సర్వీసులు నడపాలన్న ప్రజా ప్రతినిధులు, ప్రజల కోరిక మేరకు సంబంధిత అధికారులను సంప్రదించి త్వరలోనే ప్రతి డిపో నుండి కనీసం 4 బస్సు సర్వీసులను తిరుమలకు ప్రారంభించబడుతాయన్నారు. ఉద్యోగులకు మెరుగైన పెన్షన్ విధానాన్ని అందిస్తున్న వైసిపి ప్రభుత్వానికి ప్రజా రవాణా సంస్థ ఉద్యోగులు కృతజ్ఞత కలిగి, 2024 ఎన్ని కల్లో జగన్మోహన్ రెడ్డి గెలుపుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.

మాట్లాడుతున్న రాజారెడ్డి

రైతులకు అవగాహన కల్పిసున్న ఉద్యానవనశాఖ అధికారి నాగరాణి

మామిడిలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై శిక్షణ

ప్రజాశక్తి-రామాపురం

మామిడి కాయలకోత తర్వాత ఆచరించవలసిన సస్యరక్షణ చర్యలు, సమగ్ర యాజమాన్య పద్ధతులపై సోమవారం బండపల్లి పంచాయతీ వెంకట్‌రెడ్డిగారిపల్లిలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం లక్కిరెడ్డిపల్లి ఉద్యానవన శాఖ అధికారి నాగరాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడి కాయలు కోసినప్పటి నుంచి తగు జాగ్రత్తలను పాటిం చినట్లైతే నాణ్యతతో కూడిన మంచి దిగుబడులు పొందవచ్చని సూచించారు. కాయలు కోసిన తర్వాత 15 నుంచి 20 రోజులు చెట్లకు విశ్రాంతి నిచ్చిన తర్వాత కొమ్మ కత్తిరింపులు చేపట్టాలని సూచించారు. గుబురుగా పెరిగిన చెట్లలో సూర్య రశ్మి, గాలి లోపలికి ప్రసరించెల తలపైన కొమ్మలను, తూర్పు పడమర దిక్కులలో ఉన్న కొమ్మలను, ఎండుపుల్ల, చీడపీడలు ఆశించిన కొమ్మలు, తొడిమ కొమ్మలను, ఎండి పోయిన పూత కాడలను కత్తిరించి తొలగిం చాలని సూచించారు. ఈనెలలో పచ్చిరొట్టే పైర్లయిన జనుము, జీలుగా, పెసర, అలసంద, ఉలవలు, పిల్లిపెసర లాంటి పంటలు వేసి పూత దశలో కలియదున్నాలని సూచించారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్ర సిబ్బంది మాబ్‌జాన్, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడితో మాట్లాడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పిల్లల చదవుపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి-కలకడ

తమ పిల్లల చదువుల పట్ల నిర్లక్ష్యం తగదని విద్యార్థుల తల్లిదండ్రులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. మండలంలోని ఎర్రకోటపల్లి పంచాయతీ గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో సుమారు 30 మంది విద్యార్థులు చదువుతున్నట్లు తెలిపారు. 30 మంది విద్యార్థులకు గాను ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే బోధించడం సరికాదని ఆవేదన చేశారు. సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులు కలిసి పాఠశాల ఆవరణములకు వెళ్లి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్నప్పటికిని ఒక్క ఉపాధ్యాయుడే విద్యను బోధించడం కష్టతరంగా ఉంటుందని, మరొక ఉపాధ్యాయుడిని కేటాయించాలని కోరారు. తమ పిల్లలను ప్రయివేట్ పాఠశాలల్లో చదివించే స్తోమత లేకున్నా చదువు కోసం వేరే పాఠశాలల్లోనే చేర్పించక తప్పదన్నారు. స్పందించిన ఉపాధ్యాయుడు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని చెప్పారు. ఈ విషయంపై ఎంఇఒను వివరణ కోరగా డిఇఒ అనుమతిని తీసుకొని మరొక ఉపాధ్యాయుడిని ఈ పాఠశాలకు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రక్తదానం గొప్పది

సుండుపల్లి: మండల కేంద్రం సుండుపల్లిలోని శారద స్కూల్లో సోమవారం అజయ్‌రెడ్డి జన్మదినం సందర్భంగా అభిమాన సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, యువకులు పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా అజయ్‌రెడ్డి తల్లి మాజీ జడ్‌పిటిసి జయమ్మ మాట్లా డుతూ రక్తదానం గొప్పదని అజయ్‌రెడ్డి జన్మదినం సందర్భంగా రక్తదానం చేయడం గొప్ప విషయమన్నారు. ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు యువత ముందుకు రావడం అభినందనీయమన్నారు. నాయకులు మిన్నమరెడ్డి గంగిరెడ్డి, వైస్‌ఎంపిపి కదిరిచేని రెడ్డమ్మ, మాజీ సింగిల్ విండో ప్రెసిడెంట్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ సయ్యద్ అహ్మద్, సర్పంచ్ రామజయచంద్ర, మాజీ ఎంపిటిసిలు చంద్ర నాయక్, శకుంతలమ్మ, నాయకులు గంగరాజు, శివారెడ్డి కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చెన్నం శెట్టిపల్లి గ్రామస్తులు తోట రవీంద్ర, రమణ, రామాంజులు, మైనార్టీ నాయకులు సయ్యద్ మస్తాన్, ఎఐవైఎఫ్ మండల అధ్యక్షుడు అరుణ్ కుమార్ నాయుడు, భగీరథరెడ్డి, బాబురెడ్డి, మాజీ వైస్ ఎంపిపి మధుసూదన్ నాయుడు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న యువకులు

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

రాజంపేట రూరల్ : గుండ్లూరు గ్రామ పంచాయతీ బహుదానది తీరంలో వద్దనున్న సద్గురు సాయినాథ్ మందిరంలో గురు పౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. గురు పౌర్ణమి కావడంతో సాయిబాబా ఆలయంలో ఉదయం రుద్రాభిషేకం, దేవతా హవాస, యాగశాలి బలి, మహా పూర్ణాహుతి నిర్వహించారు. సందర్శనకు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. **రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం స్కూలో ఆధ్వర్యంలో..** పట్టణం నూనెవారి పల్లిలో రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం స్కూల్లో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నతనం నుంచే పెద్దలపట్ల, అధ్యాపకులు పట్ల గౌరవ భావంతో మెలగాలని పాఠశాల ప్రిన్సిపల్ సన్నపనేని రవీంద్ర నాయుడు తెలిపారు.

వేద పాఠశాల ఏర్పాటు చేయాలి

నందలూరు : నందలూరు మత సామరస్యతకు ప్రతీకని, బౌద్ధం, శైవం, వైష్ణవమైన ఈ ప్రాంతంలో వేద పాఠశాల ఏర్పాటు చేయాలని బౌద్ధరామం గ్రంథ రచయిత విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు పేర్కొన్నారు. సోమవారం శ్రీసౌమ్యనాథాలయాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ సౌమ్యనాథాలయం టిటిడిలో విలీనం కావడం ఒక శుభ పరిణామమన్నారు. విశాలమైన ఈ ఆలయ ఆవరణలో రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదాలు మారుమ్రోగునట్లు ఒక ధార్మిక కేంద్రంగా, సంపూర్ణ వేద పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు. 11వ శతాబ్దంలో రాజరాజ కులోత్తుంగ చోళునిచే నిర్మితమైన ఈ ఆలయం పాండ్య, కాకతీయ, విజయనగర, మట్లి రాజులు దశలవారీగా నిర్మాణాలు చేసి అభివృద్ధి చేశారన్నారు. పదకవితా పితామహుడైన తాళ్ళపాక అన్నమాచార్యులు అర్చించి, కీర్తించిన ఈ ఆలయానికి ఇంకా తగిన గుర్తింపు రాలేదన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి

ఇందుమూలముగా తెలియజేయడమే మనగా 3704/2018 1012/2019 సంబంధించిన లింక్ డాక్యుమెంట్స్ పీలేరు బస్టాండ్ నందు పోయినవి. ఈ డాక్యుమెంట్స్ ఎవరికైనా దొరికినచో దయచేసి మాకు తెలుపగలరని కోరుచున్నాము.

A.Padmaja
& V.Govardhan
9182287290.

పాస్‌పోర్ట్ పోయినది

పాస్పోర్ట్ తప్పిపోయినది ప్రజాశక్తి గాలివీడు వైయస్సార్ జిల్లా గాలివీడు మండలం నూలివీడు కస్పా డోర్ నెంబర్ 2/56 చెందిన పెద్దిశెట్టి వెంకటరమణ పాస్పోర్ట్ నెంబర్ **S7105675** గల పాస్పోర్టు తప్పిపోయినది ఎవరికైనా పాస్పోర్ట్ లభించినచో క్రింది సెల్ నెంబర్‌కు సమాచారం ఇవ్వగలరు.

సెల్ నెంబర్: 9491358183

టిడిపిని ఆదరించండి : ఆర్‌ఆర్

ప్రజాశక్తి-చిన్నమండెం

రాష్ట్ర భవిష్యత్తు కోసం టిడిపిని ఆదరించాలని నియోజకవర్గ టిటిపి ఇన్‌ఛార్జి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం టిడిపి శ్రేణులతో కలసి పట్టణంలోని మెయిన్‌రోడ్డు, హరిజనవాడ, బలిజపల్లి, బస్టాండ్ ప్రాంతాలలో ఇదేంఖర్మ రాష్ట్రానికి, భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ వైసిపి పాలన దాచుకో దోచుకో అన్న చందంగా పాలన సాగుతుందని విమర్శించారు. ఇసుక, మద్యం, రేషన్ బియ్యం అక్రమ రవాణా వైసిపి నాయకుల కనుసన్నల్లోనే సాగుతోందని ఆరోపించారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. పేదల సొంతింటి కలగానే మిగిలి పోయిందన్నారు. రాష్ట్రం బాగుండాలంటే చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు బెల్లం నరసింహరెడ్డి మండల ప్రధాన కార్యదర్శి నాగభూషణం, మల్‌రెడ్డి, టి.వేణుగోపాల్, క్రిష్ణారెడ్డి, సురేంద్ర, రామాంజులు, రామయ్య, కొండయ్య, రమణయ్య పాల్గొన్నారు. **కలికిరి :** వచ్చే ఎన్నికల్లో టిడిపిని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా నాయకులు కార్యకర్తలు, కృషి చేయాలని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఇందిరమ్మ కాలనీలో ఇంటింటికి నల్లారి కార్యక్రమంలో పాల్గొని టిడిపి అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లోని ప్రజలందరికీ టిడిపి ప్రవేశపెట్టబోయే మినీ మేనిపెస్టోను తెలపాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు నిజాముద్దీన్, ఎస్‌సి సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు అగస్త్రీశ్వర్, మాజీ సర్పంచ్ అంజమ్మ, టిడిపి మండల ఉపాధ్యక్షుడు రెడ్డి, మేజర్ పంచాయతీ సర్పంచ్ ప్రతాప్ కుమార్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌వర్మ వైజాగ్‌బాషా, ముస్తఫా, హజరత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రమేష్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

నూతన ఎంఇఒలకు సన్మానం

నిమ్మనపల్లి : ఎంఇఒ-1 పద్మావతిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-గాలివీడు

నూతనంగా ఎంఇఒలుగా బాధ్యతలు తీసుకున్న నాగరాజు, శ్రీనివాసులను సోమవారం ఉపాధ్యాయులు దుశ్శాలువాతో వారిని ఘనంగా సన్మానించారు. బి.కోడూరు ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులున్న నాగరాజు పదోన్నతిపై ఎంఇఒ-1గా బదిలీపై వచ్చారు. గత జూన్ 25న ఎంఇఒ-2గా శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గేశ్వరరాజు, ఉపాధ్యాయులు వెంకటచలపతి, ఆదినారాయణ, గంగాధర, రమణ, రమణయ్య పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** మదనపల్లె రెండవ ఎంఇఒగా రాజగోపాల్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు ఎంఇఓ ప్రభాకర్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది దుశ్శాలువాతో సన్మానించారు. **పుల్లంపేట :** మండల నూతన విద్యాశాఖ అధికారిగా గూడూరు చక్రధర్ రాజు పదవీ బాధ్యతలు చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కర్నూలు జిల్లా ఆలూరు మండలం ఇన్‌ఛార్జి ఎంఇఒగా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేయడం జరిగిందని అన్నారు. పదోన్నతి పై అక్కడి నుంచి పుల్లంపేట ఎంఇఒ-1 గా బాధ్యతలు చేపట్టడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. **నందలూరు :** నందలూరు మండల విద్యాశాఖ అధికారి-1గా ఎల్.నాగయ్య బాధ్యతలు చేపట్టారు. రాయచోటిలో ప్రధానోపాధ్యాయునిగా పని చేస్తూ పదోన్నతి పై నందలూరు ఎంఇఒగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, యూనియన్ నాయకులు పూలమాలతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎఇఒ-2 అనంతకృష్ణ, ఎస్‌టియు నాయకులు మోహన్‌రాజు, లీలాకృష్ణ, ఎపిటిఎఫ్ అలీఖాన్ పాల్గొన్నారు.

నిమ్మనపల్లి : నిమ్మనపల్లి ఎంఇఒ-1గా ఎంఆర్.పద్మావతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఎంఈఓ రాజగోపాల్ మదనపల్లెకు బదిలీ అయ్యారు. వారి స్థానంలో తిరుపతి జిల్లా, శ్రీకాళహస్తి మండలం పానగల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న ఎం.ఆర్.పద్మావతి బదిలీ పై నిమ్మనపల్లెకు వచ్చారు. ఎంఇఒకు ఎస్‌టియు ఉపాధ్యాయ సంఘ ఉపాధ్యాయులు శ్రీనివాసులు రెడ్డి, గురుమూర్తి, మధుసూదన్, మదనపల్లి ఇన్‌ఛార్జి ఎంఇఒ-1 ప్రభాకర్ రెడ్డి, సిఆర్‌పిలు సుధాకర, పద్మనాభం, మంజుల, స్వాతి, ఎంఐఎస్ కోఆర్డినేటర్ నరసింహులు, కంప్యూటర్ ఆపరేటర్ సౌజన్య, అటెండర్ సుబ్బయ్యలు కలసి వారికి పుష్పగుచ్చం అందించి స్వాగతం పలుకుతూ, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఇఒ పద్మావతి మాట్లాడుతూ మండలంలో విద్యా వ్యవస్థను పటిష్ట పరచడానికి, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిం చడానికి, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. **పీలేరు :** మండల విద్యాశాఖ అధికారి -1 గా వై. లోకేశ్వర్ రెడ్డి నియమితులయ్యారు. అనంతపురం జిల్లా, గార్లదిన్నె మండలం, యర్రగుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న వై. లోకేశ్వర్ రెడ్డిని ప్రభుత్వం ఎంఇఒగా పదోన్నతిపై బదిలీ చేసింది. కార్యక్రమంలో ఎంఇఒ-2 పద్మావతి, యుటిఎఫ్, ఎస్‌టియు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే జగనన్న సురక్ష

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రజల సమస్యలు గుర్తించి వాటిని తక్షణమే పరిష్కరించడానికి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందని ఎమ్మెల్యే నవాజ్ బాషా పేర్కొన్నారు. సోమవారం మదనపల్లె పిటియం క్రాస్ రోడ్డు గ్రామ పంచాయతీ నందు జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నవాజ్ బాషా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని తక్షణమే వాటిని పరిష్కరించి ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అందించి, ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కారం చేయాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి రెడ్డెమ్మ, సర్పంచ్ బండపల్లి ఈశ్వరమ్మ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ తట్టి శ్రీనివాసులు రెడ్డి, ఎంపిడిఒ భానుప్రకాష్, మదనపల్లి మండల కన్వీనర్ కే.నాగరాజు, కత్తి రాజ కిశోర్ చంద్రదేవ్ వివిధశాఖల అధికారులు, ఎంపిటిసిలు భారతి, అనసూయ, వార్డ్ మెంబర్లు, గ్రామ సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని కొత్తపేట గ్రామ సచివాలయ పరిధిలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జగనన్న సురక్ష కార్యక్రమం ఎంపిపి ముద్దా బాబుల్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటికే ప్రజల అవసరాలకు సంబంధించిన పనులన్నీ జరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ నరసింహ కుమార్, ఎంపిడిఒ రఘురాం, ఇఒపిఆర్‌డి ప్రకాశం, కొత్తపేట సర్పంచ్ మణికంఠ, సుదర్శన్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** నగర పంచాయతీ పరిధిలోని రెండవ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు జివి.రామకృష్ణ, వరప్రసాద్, మాట్లాడుతూ ప్రజల తక్షణ పరిష్కారం కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్, నగర పంచాయతీ అకౌంట్ ఆఫీసర్ బి.రమాదేవి, మండల జెఎసి కన్వీనర్ రెడ్డి హరి, విఆర్ఒ వెంకట రమణ, వైసిపి నాయకులు పాగొండ రఫీ, గృహ సారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమ ఫలాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

అర్హత కలిగిన ప్రతి గడకూ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నవాజ్‌బాషా పేర్కొన్నారు. సోమవారం రెడ్డివారిపల్లి పంచాయితీలోని పిట్టావాండ్లపల్లి, వడ్డిపల్లె గ్రామాల్లో సర్పంచ్ నూతనకాల్వ రెడ్డమ్మ నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎంపిపి నరసింహులు, సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, ఆర్‌బికె చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ రామమోహన్‌రెడ్డి, వైసిపి మండల ఇన్‌ఛార్జి ఆర్.ఐ రమణారెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్ళి సంక్షేమ పతకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో అవసరమైన రోడ్లు, సిమెంట్ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణం, తాగునీటి కొళాయిలు ఏర్పాటు, పింఛన్‌లు, వికలాంగ పింఛన్‌లు, రేషన్‌కార్డుల మంజూరు, రెవెన్యూ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి ప్రజలు తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో సర్పంచులు సుబ్రమణ్యం, చంద్రాయుడు, వైసిపి నాయకులు నరేంద్ర రెడ్డి, హరిబాబు, రామచంద్ర, రమణ ,వెంకట రమణారెడ్డి, శ్రీరాములు, కృష్ణమూర్తి, దుర్గాప్రసాద్, విజయ్ కుమార్ రెడ్డి శశిధర్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ సిరాజుద్దీన్, ఎఇలు హరినాద్ రెడ్డి, వసంత కుమార్ రెడ్డి, అమర్నాథ్ పాల్గొన్నారు.

ప్రభుత్వపథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

స్పందన అర్జీలకు తక్షణ పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజల్లో సంతృప్తిస్థాయి పెంచే విధంగా స్పందన జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారం ఉండాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టరుతోపాటు జెసి ఫర్మన్ అహ్మద్ ఖాన్, డిఆర్ఒ సత్యనారాయణ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి జయరాజ్ హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన జగనన్నకు చెబుతాం అర్జీల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ఎప్పటికప్పుడూ సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ఎలాంటి సమస్యకైనా నిర్దేశిత గడువులోగా పరిష్కారం ఉండాలన్నారు. స్పందనలో అందిన అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించడానికే అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పూర్తిగా పరిశీలించి పారదర్శకంగా విచారణచేసి అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. ఏ అర్జీకూడా రీఓపెనింగ్‌కు ఆస్కారం లేకుండా పరిష్కరించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యతిచ్చి ప్రజాసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుందన్నారు. అర్జీలు పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టడంతోపాటు నాణ్యమైన పరిష్కారం చూపించా లన్నారు. స్పందన అర్జీలు ఎట్టిపరిస్థితిలో పెండింగ్‌లో ఉండకూడదని, వచ్చింది వచ్చినట్లు ఏ రోజుకారోజు పరిష్కరించాలన్నారు. జిల్లాలో చేపట్టిన జగనన్న సురక్ష వాలంటీర్ల సర్వే వంద శాతం పూర్తి కావాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సర్వీస్ టోకెన్ జనరేట్ చేసినవి అప్‌లోడ్ చేయాలన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్లు ఆయా మండలాలలో జరుగుతున్న కార్యక్రమం అమలుపై ఎప్పటికప్పుడూ పర్యవేక్షణ చేసి వందశాతం సర్వీస్ రిక్వెస్ట్‌లు అప్లోడ్ జరిగేలా చూడాలని కలెక్టర్ సూచించారు.

ఆరోగ్య వివరాలు అప్‌లోడ్ చేయాలి

ప్రజాశక్తి-కలికిరి

ప్రజలందరి ఆరోగ్య వివరాలు కుటుంబ వైద్యుల విధాన పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారి డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. సోమవారం మండలంలోని మెడికుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన కలికిరి-2 సచివాలయంలో ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ క్యాంప్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్‌పిసి కార్యక్రమానికి హాజరయ్యే రోగుల ఆరోగ్య వివరాలు ఆప్ లోడ్‌లో నెలవారీగా ఉన్న జబ్బుల వివరాలు, చికిత్స తీసుకుంటున్న వివరాలు నమోదు చేయడం జరుగుతుందన్నారు. బిపి, షుగర్ పరీక్షలు చేసి అప్పటికప్పుడే మందులను పంపిణీ చేస్తామన్నారు. గర్భిణులకు పరీక్షలు చేసి సలహాలు, జాగ్రత్తలు వివరించి మందులను ఉచితంగా పంపిణీ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ చిన్నరెడ్డెప్ప, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫీ, ఎంఎల్ హెచ్‌పి.ఎఎన్ఎం రమ, ఆశ కార్యకర్తలు రెడ్డెమ్మ, అరుణ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

అర్జీదారులకు అన్నదానం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రతి సోమవారమూ జిల్లా కేంద్రమైన రాయచోటిలోని కలెక్టరేట్, ఎస్‌పి కార్యాలయాలకు వచ్చే గ్రీవెన్ సెల్ అర్జీదారులు, ప్రజలకు ఎంఎల్ఎ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాన కార్యక్రమం నేటితో 26వ వారానికి చేరుకుంది. వైఎస్ఆర్‌సిపి మదనపల్లె పరిశీలకులు హబీబల్లాఖాన్ సౌజన్యంతో గ్రీవెన్ సెల్ నిమిత్తం వచ్చిన అర్జీ దారులు, ప్రజలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. రుచికరమైన భోజనంతో పాటు అర టిపండును సైతం అందచేస్తున్నారు. వారం వారం ఎంఎల్ఎ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో, దాతల సౌజన్యంతో గ్రీవెన్ సెల్ రోజున జిల్లావ్యాప్తంగా వచ్చే ప్రజ లకు రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని ఉచితంగా అందిస్తుండడం హర్షనీ యమంటూ ప్రజలు అభినందిస్తున్నారు. ఒ్కట్ కమిటీ వైస్ చైర్మన్ తబ్రేజ్, యూసుఫ్, మహమ్మద్ హుసేన్,ఇస్లాం ఖాన్, ఖాజా, ముక్తదీర్ పాల్గొన్నారు.

ఎంఇఒల సన్మానంలో ఉపాధ్యాయులు

ఎంఇఒలకు సహకరిస్తాం : ఎస్‌టియు

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంఇఒలకు అన్ని విధాల సహకరిస్తామని ఎస్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యంరాజు పేర్కొన్నారు. సోమవారం మండల వనరుల కేంద్రంలో మండ లశాఖ ఆధ్వర్యంలో ఎంఇఒలుకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాయామ తనిఖీ అధికారి భానుమూర్తిరాజు పాల్గొని ఉపాధ్యాయులతో కలిసి ఎంఇఒ-1 కొండూరు రఘునాథరాజు, ఎంఇఒ-2 సుబ్బరాయులను పూలమాల, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎంఇఒలకు ఎల్లవేళలా తమ సహకారం అందిస్తామని చెప్పారు. మండలంలో విద్యా వ్యవస్థను ముందుకు తీసుకెళ్ళాలని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఎంఇఒలు తమ చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర ప్రచార కార్యదర్శి నలగట్ల గోపాల్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ సంగరాజు సుబ్రహ్మణ్యంరాజు, జిల్లా అసోసి యేట్ అధ్యక్షులు సత్యనారాయణ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీనివాసరావు, మండలశాఖ అధ్యక్షులు నరసింహులు, ప్రధానకార్యదర్శి సురేంద్ర, రీజినల్ కన్వీనర్ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు వాణి, కన్వీనర్ వేణుగోపాల్, జిల్లా కౌన్సి లర్లు మురళీ మనోహర్, స్వామినాథ్, నాగరాజు, నాగ శేఖర్, చంద్రశేఖర్, భాస్కర్‌సూరి, గనిపెంచలయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, శివసు బ్రహ్మణ్యం, సాయి ప్రసాద్, నాగ భూషణంరాజు, విశ్రాంత వ్యాయమ ఉపాధ్యాయులు షామీర్‌బాషా, విశ్రాంత ప్రధానోపా ధ్యాయులు శంకర రాజు, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు వెంకటయ్య, శివరామిరెడ్డి, నట్వ నరసింహులు పాల్గొన్నారు.

చదువుల విప్లవానికి నాంది పలికిన సిఎం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

చదువుల విప్లవానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారని సచివాలయ కన్వీనర్‌లు గుమ్మడికాయల చాంద్‌బాషా, అంజమ్మలు పేర్కొన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిల చిత్రపటాలకి పాలాభిషేకం నిర్వహించారు. వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు, మాజీ ఎంపిపి పాగొండ ఖలీల్ అహ్మద్ ఆదేశాల మేరకు ఒకటో సచివాలయం కన్వీనర్లు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరుసగా నాలుగో ఏడాది అమ్మ ఒడి పథకాన్ని అమలు చేసి తల్లులు ఖాతాల నందు రూ.13 వేలు జమ చేయడంతో విద్యార్థుల ఉన్నత చదువుల కొరకు ముఖ్యమంత్రి జగన్ అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. నేటి బాల, బాలికకే రేపటి భావిభారత పౌరులని ఆలోచన చేసి జగనన్న అమ్మ ఒడి కింద 42,61,965 మంది తల్లుల ఖాతాల్లో రూ.6,392.94కోట్లు జమ చేశారన్నారు. కార్యక్రమంలో గృహసారథులు తుమ్మగింజల జనార్ధన్, కాలేషా, వాలంటీర్లు షఫీ, శ్రీనివాసులు, నరసప్ప, సుభాష్, షబ్రీన్, స్వరూప, షహనాజ్, బానుప్రకాష్, కవిత, అక్కులమ్మ, విద్యార్థుల తల్లులు శ్యామల పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ఎక్కడ?

ప్రజాశక్తి-సుండుపల్లి

ప్రయివేట్ పాఠశాలలకు తలదన్నేలా మెరుగైన విద్య అందిస్తామని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాటలు గాలిలో రాతల్లా మారిపోయాయని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు వాపోతున్నారు. మండలంలోని పెదినేనికాలువ గ్రామ పంచాయతీలోని ఈడిగపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు పాఠశాలకు రావడం లేదని వాపోతున్నారు. ఈ విషయాన్ని ఎంఇఒ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అమ్మఒడి మాకొద్దు మా విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీ

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించండి

ప్రజాశక్తి-కలికిరి

శాంతి భద్రతలో పరిరక్షణకు ప్రజలంతా సహకరించాలని ఎస్ఐ రహీముల్లా ప్రజలను కోరారు. ఆదివారం సాయంత్రం మండలంలోని మేడకుర్తి కస్బాలో పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. గ్రామాలలో ఎలాంటి సమస్యలు వచ్చినా పోలీసులకు తెలపాలని కోరారు. ప్రజలందరూ స్నేహభావంతో మెలగాలని, ఏవైనా సమస్యలు వచ్చినప్పుడు వీలైనంతవరకు గ్రామ పెద్దల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా ప్రజలు తమ అభివృద్ధిపై దృష్టి సాధించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ

క్రైం కార్నర్

క్షతగాత్రులను 108 వాహనంలో తీసుకెళుతున్న వైద్య సిబ్బంది

నాలుగు ఆటోలు ఢీ : మహిళ మృతి

- ఎనిమిది మందికి గాయాలు

ప్రజాశక్తి-రామాపురం

నాలుగు ఆటోలు ఢీకొని ఎనిమిదిమంది గాయపడి, ఒక మహిళ మృతి చెందిన ఘటన సోమవారం మండల పరిధిలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిలో జరిగింది. స్థానిక ఎస్ఐ కొండారెడ్డి తెలిపిన వివరాల మేరకు..మండలంలోని కసిరెడ్డిగారిపల్లి పంచాయతీ కొత్త రోడ్డు నారాయణపురం సమీపంలోని నాలుగు ఆటోలు ఢీకొని సయ్యద్ జయనాబి (58) అనే మహిళ మృతి చెందగా మరో ఎనిమిది మందికి తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. గువ్వలచెరువు చెందిన ఎస్.షాబీయన్. ఎస్ జయనాబి, రహమతున్, మున్నీ, పాలెంరమణ, సాంబశివయ్య, రామచంద్ర, చిన్న రెడ్డెయ్య లు డ్వాక్రా సమావేశానికి వెళుతుండగా, మరి కొంతమంది బ్యాంక్ పనిపై రామాపురంకు బయలుదేరారని చెప్పారు. మార్గమధ్య లోకి కొత్తరోడ్డు నారయణపురం సమీపానికి రాగానే ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో తొమ్మిది మందికి తీవ్ర గాయాలు అయ్యాయని తెలిపారు. ఈ క్రమంలో ఢీ కొన్న ఆటోలను మరో రెండు ఆటోలు ఢీకొన్నాయని తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్ తరలించినట్లు తెలిపారు. చికిత్స పొందుతూ మహిళ మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్న ఎస్ఐ వెల్లడించారు.